క్లుప్తంగా

10న హెడ్ పోస్టాఫీసులో ఆధార్ మేళా

సామర్లకోట: స్థానిక హెడ్ పోస్టాఫీసులో ఈ నెల 10న ఆధార్ మేళా నిర్వహిస్తున్నట్లు హెడ్ పోస్టు మాస్టర్ టి.అమ్మిరాజు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఆధార్‌కు సంబంధించిన అన్ని రకాల సేవలను గురువారం ఉదయం నుంచి ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. పేరు, చిరునామా మార్పు వంటి సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందని, అయితే వాటికి తగిన ఆధారాలు తీసుకొని రావాలన్నారు.

గడియార స్తంభం పనుల పరిశీలన


గడియార స్తంభం పనులను పరిశీలిస్తున్న కమిషనర్

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో జరుగుతున్న గడయారం స్తంభం పనులను మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్య సోమవారం పరిశీలించారు. పనులు వేగంగా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. నమూనాలో సూచించిన విధంగా గడియార స్తంభం తయారు కావాలన్నారు. ఇసుక కొరత కారణంగా పనులలో జాప్యం జరుగుతుందని కాంట్రాక్టరు కమిషనర్‌కు వివరించారు. డీఈ ఏ అనంతలక్ష్మి, కౌన్సిలర్ బలుసు వాసు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తులకు రెండు రోజుల గడువు

పెద్దాపురం: పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాల వేలం పాటలో పాల్గొనేందుకు రెండు రోజులు మాత్రమే గడువు ఉందని ఎస్‌హెచ్‌ఓ చిట్టిబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పెద్దాపురం, జగ్గంపేట, గండేపల్లి మండలాల పరిధిలో దుకాణ దారులకు వేలం పాటకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. పాట దారులు 9వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 11వ తేదీన లాటరీ పద్ధతిలో కాకినాడ జిల్లా కలెక్టరేట్ వెనుక వివేకనందా హాల్ లో వేలంపాటలు నిర్వహించడం జరుగుతుందని ఎస్ఐ చిట్టిబాబు తెలిపారు.

ఎట్టకేలకు కల్వర్టు పనులు ప్రారంభం

సామర్లకోట: స్థానిక బలుసులపేట అల్లూరి సీతారామరాజు పార్కు సమీపంలో శిథిలమైన కల్వర్టు పనులు సోమవారం నుంచి ప్రారంభించారు. ఈ కల్వర్టు శిథిలం కావడంతో కల్వర్టు మీదుగా రాకపోకలు సాగించే వారు నిత్యం ప్రమాదాలకు గురవుతూ ఉండేవారు. సామర్లకోట స్టేషన్ సెంటర్ నుంచి పోలీసు స్టేషన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జగనన్న కాలనీ, కిర్లంపూడి వెళ్లడానికి ప్రధాన మార్గంలో కల్వర్టు సుమారు రెండు నెలల క్రితం శిథిలమయ్యింది. ఆ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు కౌన్సిల్ సమావేశంలో ఈ కల్వర్టు ప్రాధాన్యతను తెలియజేయడంతో నిధులు మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించే విధంగా చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కమిషనర్ ఎ శ్రీవిద్యలు చర్యలు తీసుకున్నారు. దీంతో ఈ కల్వర్టు మీదుగా రాకపోకలు సాగించే వారు ఊపిరి పీల్చుకొంటున్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తులు

పిఠాపురం: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 19 మద్యం దుకాణాలకు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు వచ్చినట్లు పిఠాపురం ఎక్సైజ్ సీఐ శివరామకృష్ణ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 9వ తేదీ వరకు గడువు ఉందని ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన వారు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. డీడీల ద్వారా సమీప ఎక్సైజ్ స్టేషన్లలో తమ దరఖాస్తులు అందజేయవచ్చని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీలకు ఒకే యాప్ విధానం అమలు చేయాలి

సామర్లకోట: అంగన్‌వాడీ కార్యకర్తలకు ఒకే యాప్‌లో అన్ని అంశాలను నమోదు చేసే అవకాశం కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారి సమస్యలపై సోమవారం సీడీపీఓ ఉషకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ నాయకులు వి ఎస్తేర్‌రాణి, జి.మహాలక్ష్మి, ఎస్ స్నేహలత, పీవీ పద్మావతిలు మాట్లాడుతూ యాప్‌ల ద్వారా పని భారం పెరిగి పోయిందని వాపోయారు. లబ్ధిదారుల వివరాలను నమోదు చేయడానికి పోషణా ట్రాకర్ యాప్, బాల సంజీవిని యాప్‌లు వినియోగిస్తున్నట్లు చెప్పారు. బాలింతలకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా టీహెచ్ఆర్ అందిస్తున్నామని తెలిపారు. అవి కాకుండా తిరిగి ఐదు రకాల రికార్డులు రాయాలని వత్తిడి చేస్తున్నారని వాపోయారు. వాటికి సంబంధించి రికార్డు పుస్తకాలు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్డులకు సంబంధించిన పుస్తకాల కోసం ఒక్కొక్కరూ రూ.1000 నుంచి రూ.1,200లు ఖర్చు చేయవలసి వస్తుందన్నారు. అదే విధంగా ఏడు నెలల నుంచి ఆరు సంత్సరాల లోపు పిల్లల ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారని ఆరోపించారు. 42 రోజుల సమ్మె కాలంలో అంగీకరించిన విధంగా అన్ని యాప్‌లు ఒకే యాప్‌లో కలపాలని డిమాండ్ చేశారు. ప్రీ స్కూల్స్‌ను బలోపేతం చేయాలన్నారు.

పుష్కరిణి పిండ పంకిలం

- శరన్నవరాత్ర పుణ్యస్నానాలకు అవరోధం
- మహాలయ అమావాస్య పిండ ప్రదాన సామగ్రితో అధ్వానంగా మారిన పుష్కరిణి
- ఆదాయం ఆర్జించి, శుభ్రతను విస్మరించిన అధికారులు
- దుర్వాసనతో స్నానాలకు దూరంగా భక్తులు


పిండ ప్రదానాల సామగ్రితో నిండిపోయిన పుష్కరిణి

పిఠాపురం: పాదగయ పుణ్యక్షేత్రంలోని పుష్కరిణి పాపపంకిలాలు మూటకట్టేలా తయారైంది. శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో పుణ్య స్నానాలకు ఏమాత్రం పనికిరాని విధంగా తయారైందని భక్తులు విమర్శిస్తున్నారు. పదో అష్టాదశ శక్తి పీఠమైన ఈ క్షేత్రంలో పురుహూతికా అమ్మవారు కొలువై ఉన్నారు. అమ్మ దర్శనానికి ఈ తొమ్మిది రోజులు దేశ విదేశాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో కలుషితమై దుర్వాసన వెదజల్లుతున్న పుష్కరిణిని అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. శరన్నవరాత్ర ఉత్సవాలకు ముందు రోజు మహాలయ అమావాస్య సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రమైన పిఠాపురం పాదగయ క్షేత్రంలో పిండ ప్రదానాలకు భారీగా భక్తులు తరలివచ్చి కార్యక్రమాలు నిర్వహించారు. బియ్యం, పిండి, అరటి పండ్లు తదితర వాటిని పాదగయ పుష్కరిణిలో భారీగా వేయడంతో పుష్కరిణి కలుషితమై దుర్వాసన వెదజల్లుతోంది. మహాలయ అమావాస్య వెళ్లిన మరునాడే శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శరన్నవరాత్ర ఉత్సవాల్లో పాదగయ పుష్కరిణిలో స్నానాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. దసరా సందర్భంగా గత నాలుగు రోజులుగా పాదగయకు తరలివస్తున్నారు. పుష్కరిణిలో నీరు దుర్వాసన వస్తుండడంతో కొందరు తప్పదని స్నానాలు చేసి, కొందరు నీళ్లు నెత్తిన చల్లుకుని, మరికొందరు ముక్కుమూసుకుని అమ్మవారికి నమస్కరించి వెళ్లి పోతున్నారు.


మహాలయ అమావాస్య సందర్భంగా పిండ ప్రదానాలు చేస్తున్న భక్తులు (ఫైల్)


దుర్వాసన వెదజల్లుతుండడంతో స్నానాలు చేయకుండా చూస్తున్న భక్తులు

ఆదాయంపైనే దృష్టి

మహాలయ అమావాస్యకు పిండ ప్రదానాలు చేయడానికి భారీగా భక్తులు వస్తారని తెలిసిన అధికారులు ఎలా ఆదాయాన్ని రాబట్టాలి అనే విషయంపై దృష్టి పెట్టారు తప్ప భక్తుల సౌకర్యాలను పట్టించుకోలేదు. మహాలయ అమావాస్య మరునాడు శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, వేలాదిగా భక్తులు తరలి వచ్చి పుణ్య స్నానాలు ఆచరిస్తారని అందరికీ తెలిందే. అయినప్పటికీ అధికారులు పిండ ప్రదానాలతో దండిగా ఆదాయం రాబట్టుకున్నారు తప్ప, తదనంతర పరిశుభ్రతను విస్మరించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 2500 మంది పిండప్రదానాలు చేయగా సుమారు 5 టన్నుల వరకు పిండ ప్రదాన సామగ్రి పాదగయ పుష్కరిణిలో కలిసి ఉండొచ్చని అంచనా. అలాంటి పరిస్థితుల్లో నీటిలో కలిసిన బియ్యం, పిండి ఇతర వస్తువులు త్వరగా కుళ్లి నీటిని కలుషితం చేస్తాయి. ఈ విషయం తెలిసినా ఆలయ అధికారులు పట్టనట్టు వ్యవహరించడంతో కలుషితమైన నీటిలోనే పుణ్యస్నానం చేయాల్సి వస్తోందని దసరా ఉత్సవాలకు వస్తున్న భక్తులు వాపోతున్నారు. పుష్కరిణిని శుభ్రపరచడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై అవగాహన కల్పించండి

ఆర్డీఓ శ్రీ రమణి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఛాంబర్‌లో సోమవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పి.సరిత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణ పరీక్షలకు ఉపయోగించడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఇటువంటి పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డాక్టర్ సరిత మాట్లాడుతూ పెద్దాపురం డివిజన్ పరిధిలో స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ అనూపారాయ్, నిహారిక, అనూష, న్యాయవాదులు కందుల వెంకటాచలం, వైద్య సిబ్బంది రమణమ్మ, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

- పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి
- గ్రీవెన్స్‌కు 14 అర్జీలు


అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి అన్నారు. వారం వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి 14 అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలనే ఉద్దేశ్యంతో డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు స్పందనకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టామన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆయా శాఖల మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి అందుబాటులో ఉంటారన్నారు. రామేశంమెట్టపై గ్రావెల్ అక్రమ తరలింపుపై చర్యలు చేపట్టాలని, పిల్లలు ఆస్తిని కాజేశారని, గుడి నిర్మాణంలో అడ్డుకుంటున్న వారిపై చర్యలు చేపట్టాలని తదితర సమస్యలపై 14 ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించడం జరిగిందని ఆర్డీఓ శ్రీరమణి తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ ఏఈ రవిశంకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థపై అవగాహన తప్పనిసరి

సామర్లకోట: పంచాయతీరాజ్ వ్యవస్థపై ప్రజా ప్రతినిధులు అవగాహన పెంచుకోవాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. మండల పరిధిలోని 18 గ్రామాలకు చెందిన ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో నిర్వహించే శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే సర్పంచ్‌లకు పంచాయతీరాజ్ వ్యవస్థ, పంచాయతీ చట్టాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మేరకు గ్రామాల్లో ప్రజల అవసరాలను తెలుసుకొని వాటిని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించవలసిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. దీనిలో భాగంగా స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు వీధిలైట్లు సక్రమంగా వెలిగే విధంగా చూడటం, మెరుగైన పారిశుద్ధ్య పనులు జరిగే విధంగా చూడవలసిన బాధ్యత వారిపై ఉందన్నారు. పంచాయతీల నుంచి అందే సేవలతో పాటు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గ్రామ ప్రజలకు అందే సేవలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో ఆరోగ్య సమస్యలపై గ్రామ సభలు ఏర్పాటు చేయడం, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయడం చేయవలసి ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారం సక్రమంగా అందే విధంగా చూడాలన్నారు. ఎంపీడీఓ కె హిమా మహేశ్వరీ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులకు రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ పంచాయతీ సమావేశాలల్లో అధికారులను ప్రశ్నించడానికి, గ్రామాలలోని సమస్యలు పరిష్కరించడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈఓపీ ఆర్డీ బైరవమూర్తి, రీసోర్సు పర్సన్లు తోట సత్యనారాయణ, సునీల్‌కుమార్‌లు శిక్షణ నిర్వహించారు.


ప్రజా ప్రతినిధుల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్తిబాబు

స్వచ్ఛ పఖ్వాడాలో భాగస్వాములు కండి


సామర్లకోట రైల్వే ట్రాక్ మధ్యలో చెత్తను తొలగిస్తున్న అధికారులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ స్వచ్ఛ రైల్వే స్టేషన్‌గా అవతరించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం రమేష్ అన్నారు. స్వచ్ఛ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్లాట్‌ఫారంపై తాగునీటి కుళాయిలను శుభ్రం చేయడంతో పాటు డ్రైన్లు, రైల్వే ట్రాక్‌ల మధ్య ఉన్న చెత్తను తొలగించే కార్యక్రమాలను చేపట్టారు. స్వచ్ఛ రైల్వే ట్రాక్ కోసం ప్రయాణీకులు చెత్తను రైలులో నుంచి పట్టాలపై వేయకుండా రైలు దిగిన వెంటనే ప్లాట్‌ఫాంపై ఉన్న డస్టు బిన్‌లో వేయాలన్నారు. ప్రయాణీకులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 వరకు స్వచ్ఛ పఖ్వాడా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తరువాత నుంచి ప్లాట్ ఫాంపై చెత్త వేసిన వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి వారికి అపరాధ రుసుం విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు శివ ప్రసాద్, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి, రైల్వే సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. స్వామి వారికి ప్రీతి పాత్రమైన రోజు కావడంతో పాటు ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించడంతో తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, పూజలను పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు పాలు, ఆలయ పుష్కరిణి నుంచి తెచ్చిన నీళ్లతో ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివ లింగానికి స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఆలయంలోని పెద్ద నంది, మూలవిరాట్ ఉప ఆలయాలు, స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజగోపాల్ శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి సుందర రామయ్య, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం..



అధికారుల పేర్లు మారని సమాచార హక్కు చట్టం బోర్డు

సామర్లకోట: మండల ప్రజా పరిషత్తు కార్యాలయం ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన సమాచారం హక్కు చట్టం బోర్డులో రెండు నెలల క్రితం బదిలీ అయిన ఎంపీడీఓ పేరు ఇంకా కనిపించడం సిబ్బంది పని తీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. సమాచారం చట్టం ప్రకారం ఎంపీడీఓ ప్రథమ అప్పిలేట్ అధికారిగా ఉంటారు. అదే విధంగా ప్రజా సమాచార అధికారి కె మంగతాయారు, సహాయ ప్రజా సమాచార అధికారి చంద్రశేఖర్లు కూడా ఇటీవల బదిలీ అయ్యారు. అయితే వారి పేర్లు కూడా బోర్డుపై దర్శన మిస్తున్నాయి. దీని కారణంగా కార్యాలయానికి వచ్చే వారు ఇబ్బంది పడే అవకాశం ఉంది. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని విశాఖపట్నం జిల్లాకు చెందిన ఎస్‌డీ శ్యామ్ సుందర్‌ను నియమించారు. ఎన్నికలు తరువాత ఆయన ఆగష్టులో సొంత జిల్లాకు బదిలీపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో గతంలో పని చేసిన ఎంపీడీఓ డి శ్రీలలిత ఆగస్టు 17న బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీలలిత పెద్దాపురం బదిలీ కావడంతో ఈనెల 4న రిలీవ్ అయ్యారు. కాగా ఆమె స్థానంలో అనపర్తి మండలం నుంచి బదిలీపై వచ్చిన హిమా మహేశ్వరి 5న బాధ్యతలు స్వీకరించారు.

సిరుల తల్లి.. కల్పవల్లి

- లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన జగన్మాత
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు


భువనేశ్వరి పీఠంలో హోమాలు నిర్వహిస్తున్న పండితులు

పిఠాపురం: దసరా ఉత్సవాలు పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాజరాజేశ్వరీదేవి అమ్మవారు సిరులు కురిపించే లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని పాదగయ క్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారు, అష్టాదశ శక్తి పీఠాల్లో పదో శక్తి పీఠానికి అదిష్టాన దేవతైన పురూహూతికా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాడలో వేంచేసిన లలితాదేవి అమ్మవారు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తాటిపర్తిలో వెలసిన అపర్ణాదేవి అమ్మవారు స్కంద మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. పిఠాపురం మండలం రాపర్తిలో దుర్గామల్లేశ్వరి అమ్మవారి బోనాల సంబరం కన్నులపండువగా జరిగింది.

చండీదేవిగా కనకదుర్గమ్మ

సామర్లకోట: మండల పరిధిలోని పీబీ దేవం గ్రామంలో శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితిలో వేంచేసి యున్న కనకదుర్గ అమ్మవారు ఐదో రోజు సోమవారం చండీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. ఈ మేరకు సేవా సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాధ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మహా చండీదేవి అవతారంలో భువనేశ్వరి మాత

పెద్దాపురం: స్థానిక వర్జుల వారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ భువనేశ్వరి పీఠంలో సోమవారం భువనేశ్వరి అమ్మవారు మహా చండీదేవి అవతారంలో దర్శనమిచ్చారు శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఉదయం నుంచి పీఠంలో మండప ఆరాధన, అమ్మ, అయ్యవార్లకు అభిషేకాలు, అమ్మవారికి సహస్ర కుంకుమ పూజ, నవ చండీ పారాయణం, శ్రీచక్రార్చన, చండీ హోమం, మంత్ర పుష్పం, దర్బారు సేవ నిర్వహించారు.

మహా చండీ అవతారంలో అమ్మవార్లు

కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ అమ్మవార్లు సోమవారం మహాచండీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓలు విజయలక్ష్మి, సౌజన్యల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


చదలాడలో కలశాలతో మహిళల ఊరేగింపు

చదలాడలో కలశ యాత్ర

మండలంలోని చదలాడ గ్రామంలో మహిళల కలశ పూజ ఘనంగా నిర్వహించారు. వందల సంఖ్యలో మహిళలు పసుపు, ఎరుపు రంగు చీరలతో కలశాలను నెత్తిన పెట్టుకుని గ్రామ వీధుల్లో అమ్మవారి కలశ యాత్రను వైభవంగా నిర్వహించారు. స్థానిక కనకదుర్గమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కలశ యాత్రకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

కామాక్షీ దేవిగా బాలా త్రిపుర సుందరి

సామర్లకోట: పంచారామ క్షేత్రంలోని అమ్మవారు బాలా త్రిపుర సుందరి సోమవారం కామాక్షీ దేవి స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పంచారామ క్షేత్రంలోని అమ్మవారి ఆలయంలో ఈ నెల 3 నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఐదవ రోజు అమ్మవారిని కామాక్షీ దేవిగా అలంకరణ చేశారు.


పాదగయ క్షేత్రంలో లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరీదేవి


పీబీ దేవంలో చండీదేవి అలంకారంలో అమ్మవారు


విశేష అలంకారంలో పురూహూతికా అమ్మవారు


కామాక్షీదేవిగా దర్శనమిస్తున్న బాలా త్రిపుర సుందరి


పిఠాపురంలో ఇంద్రాణి దేవిగా మహాలక్ష్మి అమ్మవారు


తాటిపర్తిలో స్కంద మాత అలంకరణలో అపర్ణాదేవి


కొత్తపల్లిలో శాకంబరిగా కనకదుర్గా అమ్మవారు


మహాచండీ దేవి అవతారంలో భువనేశ్వరి అమ్మవారు


మహచండీ అవతారంలో నూకాలమ్మ అమ్మవారు